యక్షప్రశ్న

మా వూరి సర్పంచ్ బసవరాయణ్ణి గురించి కిట్టనివాళ్ళు ఎన్ని పోసుగోలు కబుర్లయినా చెప్పుకోవచ్చు. నేను మాత్రం ఆయనలో ఒక గొప్ప సుగుణం వుందని ఘంటాపథంగా చెప్పగలను. రాయిలాగా, రప్పలాగా ఆయన ఒక జడ పదార్థంలా వుండిపోయిన వారు కాదు. దేశాన్ని, కాలాన్ని, పరిస్థితుల్ని గుర్తెరిగి ఎప్పటికప్పుడు తన అభిప్రాయాలను మార్చుకుంటూ వచ్చినవాడు. బసవారాయడి జీవితాన్ని మూడు దశలుగా విభజిస్తే - మొదటిదశలో ఆయన గావించిన ధర్మసంస్థాపనం, రెండో దశలో ఆయన సల్పిన సంఘసేవ, మూడో దశలో ఆయన సాధించిన భావ విప్లవం భావితరాల వాళ్ళు మరీమరీ మననం చేసుకుని ఆనందించదగ్గవి. అంతెందుకు? స్థానిక సామాజిక చరిత్రను ప్రత్యేకంగా వ్రాయనక్కర్లేదు. ఆయన జీవిత గాథను గ్రంథస్థం చేస్తేచాలు.

ఏనాడో ప్రారంభమైనప్పటికీ ఈ కథకు ముగింపు మాత్రం నిన్నమొన్నటిది. ఆదినుంచీ పూస గుచ్చినట్టు చెప్పానంటే, ఇది 'దూమ్స్‌డే చిట్టా'లాంటి ఉద్గ్రంథమై పోయే ప్రమాదం ఉంది. మరైతే ఎక్కడి నుంచి ప్రారంభించడం? నా పాలిటికిది పెద్ద కృత్యా ద్యవస్థ అయిపోయింది. దీర్ఘాలోచన తర్వాత ఒక నిర్ణయానికి రాగలిగాను. కథ ఎక్కడినుంచి అయితే అడ్డం తిరుగుతుందో అక్కడినుంచే ప్రారంభించడం, అవసరాన్ని బట్టి వెనక్కి వెళ్ళి, మళ్లీ ముందుకు రావడం!

మరైతే ఈ కథ అడ్డం తిరిగిందెప్పుడు?

స్ఫురించింది. సమితి హెడ్ క్వార్టర్స్ నుంచి బిడిఓగారు రాసిన చీటీ దగ్గరినుంచే దీన్ని మొదలెట్టవచ్చు.

"నెమళ్లదిన్నె సర్పంచి రాజశ్రీ బసవారాయడుగారికి -

భగవదనుగ్రహం వల్ల నేను డిగ్రీ పుచ్చుకుని, చిన్న గుమాస్తాగా రెవిన్యూ డిపార్టుమెంటులో ప్రవేశించి, వేర్వేరు చోట్ల వేర్వేరు హోదాల్లో పనిచేసి, చివరికి బి.డి.ఓ.గా ప్రమోషను పొంది, ఈ కొత్త పదవిలో మన సమితికే బదిలీ అయివచ్చి, ఇక్కడ ఛార్జీ పుచ్చుకున్న విషయం మీకు తెలిసేవుంటుంది. నా ఈ స్థితికి కారకుడైన మన వూరి దేవుడు శ్రీ ప్రసన్న లక్ష్మీనరసింహస్వామి వారిని వీలయినంత తొందరలో దర్శించి, అభిషేకం, అర్చన వగైరా కైంకర్యాలతో భక్తి ప్రపత్తులు చెల్లించుకోవలసిన అవశ్యకర్తవ్యం నాపైన ఉంది. ఈపనిపైన నేను పై ఆదివారం ఉదయం మన వూరికి వస్తున్నాను. ధర్మకర్తలు గనుక మీకు తెలియజేయడమైంది. ఇట్లు, నగారా గంగాధరం, మండల వికాసాధికారి, పైడిమర్రి పంచాయతీ సమితి.

చదివి ముగించేసరికి చీటీ బసవారాయడి చేతిలో నలిగిపోయింది. కోపం పొగలుగా సెగలుగా మారి స్వేదరంధ్రాలలోనుంచి వెలుపలికి చిమ్మింది. చేతివ్రేళ్లు వంగి పిడికిట్లోకి బిగుసుకుపోయాయి. పై పండ్లు కింద పండ్లతో రాచుకుంటూ గీపెట్టాయి.

ఆకాడికీ ఈకాడికీ వచ్చి ఆఖరుకేకాడి కొచ్చినావురా గంగా! చద్ది కలిపి పోస్తే నోటి కడ్డంగా దోసిలి పట్టుకుని మా యింటి గడపలో కడుపునింపుకున్నోడురా నీ తాత.

మా మడిలో అడుసు దున్నుతూ తట్టలో వచ్చే సంగటి ముద్దకోసం మిర్రి మిర్రి చూచినోడురా నీ అయ్య! బోడి బీడివో ఉద్యోగం వస్తే మటుకు నీ కండ్లు నెత్తికొచ్చినాయంట్రా?"

శివరాత్రి అని తెలిస్తే, బసవారాయడికి పెందలకడనే నిద్ర ముంచుకొస్తూ ఉండేది. వైకుంఠ ఏకాదశి అయితే సాయంత్రం ఆరున్నరకల్లా నిద్రదేవత వచ్చి కనురెప్పలపైన కూర్చునేది. అలాంటిది గంగాధరం చీటీ అందిన రోజు రాత్రి బసవారాయడు ఆదమరిచి కునుకు దీసివుంటే ఒట్టు. ఇంచుమించు ఒక అర్ధశతాబ్ది పర్యంతంగా గ్రామంలో తాను కావిస్తూ వచ్చిన ధర్మ సంస్థాపనానికి ఉన్నట్టుండి ఒక్క పెట్టున పెద్దగండి పడిపోయింది గదా! ఇక రమ్మంటే మాత్రం నిద్ర ఎలావస్తుంది...

భగవంతుని దశావతార విశేషాలను గురించి చెప్పుకున్నట్టుగా, ధర్మపరిరక్షణ విషయంలో బసవారాయడు పాటిస్తూ వచ్చిన దండనీతిని గురించి జనం ఎన్నో ఆహ్లాదకరమైన కథలు చెప్పుకుంటారు. ఒకసారి నల్లజీవాలు (పందులు) వేరుశనగ చేలల్లోపడి తొక్కి పాడుచేసినందుకు ఆయన జోగల వాళ్ళ గుడిసెలపైన చెత్త లేకుండా పీకి పోగులు పెట్టించాడు. ఇంకొకసారి గొల్లవాళ్ళు కబురు పెట్టగానే పిలుపందుకోలేదన్న కోపంతో, వాళ్ల గొర్రెల మందల్ని అడుసు మళ్ళల్లోకి పరవదోలించి, బురదలో కూరుకుపోయి అవి కదలలేక దీనంగా అక్రోశిస్తుంటే మీసం మెలిద్రిప్పాడు. కూరగాయల పాదులో బుట్టెడు వంకాయలు కోసుకెళ్లిన పాపానికి అదే వంకాయలతో కూర్చిన దండను మెడలోవేసి పాలె సుబ్బయ్యను సంతలో నిలబెట్టాడు. పండి రాలిపోయిన టెంకాయలు రెండిట్ని పట్టుకెళ్లి కొట్టులో అమ్ముకున్న దురాగతానికి ఈడిగ చెన్నయ్యకు యాభై జాటీ దెబ్బలు వడ్డించాడు. మటుమాయమైపోయిన పందెం కోడిపుంజు తాలూకు ఈకలు మేదర చెంగన్న ఎరువుదిబ్బలో కనిపించిన నేరానికి ముఖాన మసిబొట్టు పెట్టి అతణ్ణి ఊరంతా త్రిప్పాడు. ఈ కోవలో అత్యంత ఇంటరెస్టింగ్ ఉదంతం మరొకటుంది. అది తప్పకుండా విని తీరవలసింది. నిద్రాభంగం కలిగినందుకు ఆగ్రహించిన బసవారాయడు తన జాగిలాన్ని ఓ బుడబుక్కలవాడిపైకి ఉసికొలిపేశాడు. ప్రాణాలరచేతబట్టుకుని ఊరుదాటేసరికి, వాడి పంచ చీలికలు వాలికలై వూడిపడిపోయింది. అంతటితో కుక్క వాడి నల్లటికోటుపైకి ఎగబాకింది. కోటు నట్లాగే క్రిందికి దిగవిడిచి బుడబుక్కలవారు కౌపీన మాత్రవేషధారిగా ఓ చెట్టు చిటారుకొమ్మలోకి ఎగబ్రాకిపోయారు.

నల్లులు, బల్లులు, ఈగలు, దోమలు మొదలైన వాటిని క్షుద్రప్రాణులుగా వ్యవహరిస్తాం. మనుషుల్లోనూ అలాంటి వాళ్ళున్నారన్నది బసవారాయడి నిశ్చితాభిప్రాయం. చెప్పులు వసారాలోవుండాలి. చీపురు తలుపు వెనుక వుండాలి. పేడతట్ట పెరట్లో వుండాలి. ఇలా తన ఆశ్రిత, పరివార, పరివేష్టిత జనానికి సంబంధించి బసవారాయడు ఎవరి స్థానాలు వారికి స్పష్టంగా కేటాయించాడు.

ఈ ప్రాతిపదికపైన తన ఊరిదైవం శ్రీ ప్రసన్న లక్ష్మీనరసింహస్వామి వారినిగూడా పూర్తిగా తన అదుపు క్రింద పెట్టుకోడంలో బసవారాయడు కృతకృత్యుడయ్యాడు. ఏడాదికి ఒకసారి పారువేటనాడు మాత్రమే స్వామి వారికి విడుదల. మిగిలిన ఏడాది పొడుగునా గృహనిర్బంధమే. బిగిసిన తాళం వెనుక, మూసిన సింహద్వారం వెనుక భగవంతుడి

అతీగతీ బయటివాళ్ళకెలా తెలుస్తుంది? పడమటివైపు ప్రహరీలోని ద్వారం గుండా రాకపోకలు సల్పుతూ పూజారి స్వామివారికి నిత్యపూజలు చేస్తూ వుంటాడని గ్రామస్తుల్లో ఒక ఊహ మాత్రం కద్దు. అందులోని నిజానిజాలేపాటివో తేల్చుకున్నవాళ్లు లేరు. బసవారాయడి సమిష్టి కుటుంబంలో తానొక వ్యక్తిమాత్రుడై పోయాక, ఇక స్వామి వారితో తమకుగానీ, తమతో ఆయనకుగానీ పనేముంటుందన్న వైరాగ్యభావం ఒకటి స్థానిక ప్రజల్లో పాదుకపోయింది. ఒకవైపున శేషాద్రి వెంకన్న చేతుల సాచి సమస్త జనుల్నీ తన అక్కున చేర్చుకున్నాడు. మరొకవైపున శ్రీశైలం మల్లన్న సర్వజీవులపై సమదృష్టిని ప్రసరిస్తున్నారు. ఇంకొకవైపున భద్రగిరిరామన్న తనసేవకు లౌకికమైన అవరోధాలేమీ లేవని ప్రకటించేశాడు. కానీ నెమళ్లదిన్నె స్వామికి మాత్రం అలాంటి అవకాశం లేకపోయింది. అసలు గ్రామస్తులకే ఆ ప్రాప్తం లేకపోతే, ఇంక వాడల్లో, గూడాల్లో, గ్రామ శివార్లలోని పల్లెల్లో నివసించే జనాన్ని గురించి చెప్పేదేముంది? వాళ్ల పాలిటికి లక్ష్మీనరసింహస్వామి అక్కరకురాని చుట్టంగా, మొక్కుదామన్నా కనిపించని దైవంగా మిగిలిపోయాడు.

అదిగో, సరిగ్గా అలాంటి సందర్భంలోనే నగారా గంగాధరమంటూ ఒకడు పుట్టుకొచ్చేశాడు. అలనాడు సాక్షాత్తుగా భగవంతుడే ఒక భక్తుణ్ణి చెరనుంచి విడిపిస్తే, ఈనాడు భక్తుడే భగవంతుడికీ చెరనుంచి విముక్తి ప్రసాదించాలని చూస్తున్నాడు.

పులిగా మారే అవకాశం వుండే గంగాధరంపైకి దూకి గొంతు కొరికి పచ్చినెత్తురు తాగేసేవాడి. బసవారాయడికీ లేకపోయింది. పైగా పులిమీద పుట్రలాగా మరునాడు తెల్లవారే అతడి అంతరంగంలో కోపానికీ, ఉక్రోషానికీ బదులుగా భయాందోళనలు చోటు చేసుకున్నాయి. గంగాధరాన్ని అడ్డుకోడం సులువే. కానీ తదనంతర పరిణామాలు తన పీకచుట్టూ ఉరిత్రాళ్ళలా బిగుసుకోవని ఏం నమ్మకం? ప్రభుత్వం చర్య తీసుకుంటుందో, లేదో ఆ సంగతి అటుండనీ! గుడికీ, అర్చకుడికీ, భజంత్రీలకు చెందిన మాన్యాలు గత ముప్పైయేళ్లుగా తన హక్కు భుక్తంలో వుండిపోయాయి. అందుకు లెక్కలు చూపించమంటే తాను చిక్కుల్లో పడిపోవడం ఖాయం.

గాఢ నిద్రలోనుంచి హఠాత్తుగా మేలుకున్నట్టుగా బసవారాయడు అప్రమత్తుడై పోయాడు. గుడి తలుపులు తీయించాడు. గోడలకు వెల్లవేయించాడు. పచ్చతోరణాలు కట్టించాడు. కొత్త బట్టలతో, తాజా పూలదండలతో దేవుడికి ముస్తాబు చేయించాడు. అన్ని ఏర్పాట్లు ఇలా నిర్వహించి, జీపు సవ్వడికోసం చెవులప్పగించి కూచున్నాడు. అయితే అతడెదురు చూచిన జీపు వెళ్లివెళ్లి హరిజనవాడలో నిలిచింది. ఊరు ఊరంతా వెంట రాగా? గుడివైపు కదిలింది. జోగలవాళ్లు, వడ్డెరవాళ్లు, యానాదులు, గొల్లలు మొదలైన వాళ్ళందరూ ఉపనదుల్లా వచ్చి సమూహంలో కలిశారు. బసవారాయడి పాలిటి కాదృశ్యం తన కోటల్ని కూల్చివేయడంకోసం జరుగుతున్న దండయాత్రలా అనిపించింది. కొన్నివేల చీమల్లో తగులుకున్న పన్నగంలా అతను చిక్కి బిక్కరించాడు. ఎంతోకాలంనుంచి తన బండిని లాక్కొచ్చిన వాళ్లు, ఇప్పుడందులో నుంచే తనను క్రిందికి తోసేశారు. కాదు కూడదని మునుపటి దాష్టీకం చలాయిస్తే సరేకానిమ్మని తనపైనుంచే చక్రాలను పోనిచ్చేట్టున్నారు.

ఆనాటి సాయంకాలం జరిగిన సభలో గంగాధరం చెప్పిన మాటలు వింటుంటే – బసవారాయడికి ఉన్న మతికూడా పోయింది.

"బసవారాయడుగారంటే ఏమనుకున్నారు? కంచుకాగడా పెట్టి వెదకండి. ఇటువంటి మహానుభావుడు గనుక దొరికితే నేను ముక్కూ, చెవులూ కోసుకుంటాను. మట్టిబుర్రలు కాబట్టి ఆయన్ను అర్థం చేసుకోడం మీ తరంగాకపోయింది. అమ్మయినా అడగందే పెట్టదని మీకు తెలియదా? ఆహా, అదికాదా. మీ తలపొగరు గురించి తలచుకుంటే నాకు ఒళ్లు మండుకొస్తోంది. కాకపోతే జానాబెత్తెడు చీకటి గుడిసెల్లో కలుగుల్లో ఎలుకల్లా బ్రతుకు దీస్తున్నారే. అయ్యా, ఇల్లు కట్టుకోడానికి మాక్కొంచెం జాగా ఇప్పించరా అని మీరెప్పుడైనా ఆయన్ను అడిగి చూశారా? మంచినీళ్లకోసం కడవలు తలపైకెత్తుకుని ఏ ఏట్లోకో, వల్లకాట్లోకో అఘోరిస్తారే. ఊరూరికి ఒకటో రెండో బోరింగులు వేయించమని మీరేనాడైనా ఆయనతో మొరపెట్టుకున్నారా? పల్లెపల్లెకూ స్కూలుంటే సరిపోయిందా? పిల్లలు కూచోడానికి నీడవుండొద్దా? తలచుకుంటే పక్కా బిల్డింగులు కట్టించి పారెయ్యడం బసవారాయడిగారికేం లెక్కా, జమా! పదివేల రూపాయల విరాళం విసిరి పారేస్తే గ్రామంలో, హైస్కూలు పెట్టుకోడానికి జిల్లా పరిషత్తువాళ్లు అనుమతిస్తారు గదా? 'అయ్యా బాబూ! విరాళం' అంటూ మీరాయన వెంటబడి మారాం చేసిన పాపానపోయారా? ఒక బస్సు షెల్టరు, ఒక ఆసుపత్రి, ఒక సహకార పరపతి సంఘం – ఇట్లాంటివేమీ మీకు అక్కర్లేదా? ఒక గొప్ప వ్యక్తి అండదండలు పుష్కలంగా వుండికూడా పరమహీనంగా బ్రతుకుతున్న మిమ్మల్ని ఆ భగవంతుడైనా రక్షించగలడని నేననుకోను..."

ఇదీ వరస!

చాలని దానికి తిరిగి వెళ్ళడానికి ముందు కొంచెం అభినందన, పరామర్శతో కలిపి గుప్పించాడు.

"ఈనాటి కార్యక్రమానికి ఏర్పాట్లు చేయడంలో ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. చాలా సంతోషం. ఒక్కటే వెలితి. నరసింహంగారు కనిపించకపోవడం!"

పుండుపైన కారం చల్లినట్లుగా బసవారాయడు విలవిలలాడిపోయాడు.

నరసింహమంటే బసవారాయడి కుటుంబానికి కులదీపకుడు. జ్యేష్ఠపుత్రుడన్న మాట! నరసింహమున్నూ గంగాధరమున్నూ సమవయస్కులు. బసవారాయడు కుమారుణ్ణి హైస్కూల్లో చేర్పించిన వారం రోజులకు గంగాధరం అదే తరగతిలో 'అడ్మిట్' అయ్యాడు. సదరు అవమానాన్ని భరించలేక నరసింహం చదువుకు నామం పెట్టి ఇంటికొచ్చేశాడు.

మిగిలిన కొడుకుల విషయంలోనైనా బసవారాయడికి ఒక్కింతలో ఓదార్పు లభించి వుండవచ్చు. ఆ అదృష్టంకూడా లేకపోయింది. డొనేషన్లు కట్టి ఇద్దరు కొడుకుల్ని 'డాక్టరీ' చదివించాడు. లక్ష రూపాయలు వదిలిపోయాయి. ఇద్దరూ పదిలంగా ఇంటి దగ్గరే ఉన్నారు. ఉద్యోగాన్వేషణ కొనసాగుతూ వుంది.

చివరి వాడు 'సాగర్'లో అదేమిటో పనికిమాలిన కోర్సు వెలగబెడుతున్నాడు. దానికైనా అంతదూరం వెళ్తేగాని వాడికి సీటు దొరికిందికాదు.

ఈ కుటుంబిక విషయాలను బసవారాయడు అట్టే పట్టించుకోలేదు. కానీ స్థానిక సమాజంలో అప్పటివరకూ ఎదురులేకుండా ఎగురుతూ వచ్చిన తన బావుటా

భూమార్గంవైపు మొగ్గసాగిన తర్వాత అతడు బాగా క్రుంగిపోయాడు. కాలానికి దేశానికి ఏదో దుర్గతి పట్టినట్టు అతడికి తోచింది. మిన్నులు విరిగి, కొండలు కదలి, భూమి వ్రయ్యలై పోయి ఎన్నో అనర్థాలు తన చుట్టూరా క్రమ్ముకున్నట్టు తోచింది. కాకపోతే దేవాదాయ ధర్మాదాయ శాఖ అనే దిక్కుమాలిన డిపార్టుమెంటుకు ఉన్నట్టుండి ఎక్కడలేని తెలివీ - కాకపోతే తెగులు - పుట్టుకొచ్చేదేనా? బోనులో నిలబెట్టి జైలుకు పంపక పోవడమొక్కటే వాళ్లు తనకు చేసిన మేలు. గుడి తాళం చెవులు అప్పగించడంతోపాటు- కనిపించకపోయిన దేవుడి నగల కిమ్మత్తుతో కలిపి అక్షరప్రాప్తిగా డెబ్బై అయిదువేలు చెల్లించుకోవలసి వచ్చింది. ఈలోగా నామమాత్రపు ఖరీదుకే తన కయ్యలు, జాగాలు లాక్కుని అక్కడ కాలనీలు కట్టేశారు. బొమ్మరిండ్లలాంటి ఇల్లు చిత్రిక పట్టినట్టుండే వీధులు, ఊరా, ఉద్యానవనమా అనిపించేటన్ని చెట్లు. ఆహా, ఏం భోగమొచ్చిందిరా నాయనా? అటువైపు చూచినప్పుడల్లా గుండె గతుక్కుమంటూ వుంటుంది. ఈ కొత్తపల్లెల్లో ఇంటింటికీ ఒకరో ఇద్దరో చదువుకున్నవాళ్ళు. చాలామందికి ఉద్యోగాలుగూడా దొరికిపోయాయి. మడత చెరగని ఇస్త్రీ దుస్తులతో వచ్చి బస్సు దిగి, చెప్పులైనా తీయకుండా టక్కు టక్కున నడచిపోతుంటే, వాళ్లు తన రొమ్ముపైన నడిచినట్టే వుంటోంది. వీళ్ళ సిగదరగా! ఏం పొయ్యేకాలమొచ్చిందయ్యా వీళ్లకు. బస్సులో తాను నిల్చునివున్నా లేచి సీటివ్వరే! కాల్చే సిగరెట్టును దాపెట్టుకోకపోతే పోయిరి! తాను చూసేటట్టు ఉంగరాలుంగరాలుగా పొగ పైకి వదిలేస్తారా? అప్పటికీ తన ముఖంపైకి ఊదకపోవడమేనా తాను చేసుకున్న పుణ్యం! ఇంకేముంది నాయనా! పోయింది.

అంతాపోయింది. ఆ మధ్య వచ్చిన ఎన్నికల్లో పంచాయితీ బోర్డుగూడా రిజర్వేషన్ పేరుతో నీరుగట్టు వెంకటాద్రిపరమైపోయింది. ఇప్పుడిక తానొకటిగాదు. కొమ్మలన్నీ కాలిపోయాక బోసిగా మిగిలిపోయిన నల్లటిమోదు ఒకటిగాదు.

తన అధికారాలు, సదుపాయాలూ అలా క్రమంగా దోపిడీ అవుతూ రావడంతో బసవారాయడికి అన్నహిత వడుగంటింది. నిద్ర కరువైంది. ప్రతీకారేచ్ఛ బుసలు గొట్టింది. జరిగిన అవమానానికీ, కలిగిన నష్టానికీ పరిహారం సాధించకపోతే, తానిక బ్రతికి వుండడంలో అర్థం లేదనిపించింది.

బడిపంతుల్ని పిలవనంపాడు బసవారాయడు. "ఏమయ్యా! టీచరూ! నా మనవడికి ఆరో ఏడు వచ్చింది. పేర్రాసుకో" అన్నాడు.

"అట్లాగేనండీ! అందుకోసం మీరొక ఫారం నింపవలసి వుంది" అన్నాడు పంతులు. "ఎక్కడుందది? దీసుకొచ్చినావా?"

"ఇదిగో, ఇక్కడున్నట్టొస్తాను..." పరుగున వెళ్ళి ఫారం పట్టుకొచ్చేశాడు పంతులు.

"చేవ్రాలు పెడతాలేగానీ, ఇవరాలన్నీ నువ్వే రాసుకో" అన్నాడు బసవారాయడు.

"చెప్పండి" అంటూ ఉపక్రమించాడు పంతులు "అబ్బాయి పేరు?"

"రంగబాబు"

"పుట్టినతేదీ?"

"ఎనభై ఒకటిలో పుట్టినట్టుగా రాసుకో..."

"మతం, కులం..."

"మతం సంగతి నీ ఇష్టం, కులం నేన్చెప్పినట్టురాయి. కొండ ఎరుకల..."

త్రుళ్లిపడ్డాడు బడిపంతులు. "అయ్యయ్యో. అదేం మాట! కొండ ఎరుకల అనేది అసలు సిసలు ఎస్.టి కిందికి..."

"అరె - నేన్చెప్తావుంటే నీకేమయ్యా! రాసుకో, మా తాత కొండ ఎరుకలోడే. మా అయ్య కొండ ఎరుకలోడే. నేను, నా కొడుకులు, మనవళ్లు మేమందరమూ కొండ ఎరుకలోళ్లమే..."

"లేదులెండి! మీరేదో తమాషాకు..."

"ఛత్... నీతో నాకేందయ్యా తమాషా! నేన్చెప్తావుంటినిగదా! మా కులమదే! నువు రాసుకుంటావా, లేదా?"

"సరి సరే! మీరు చెప్పినట్టే..."

రాసుకున్నాడేగానీ ఉపాధ్యాయుడికి మాత్రం మనసు మనసులో లేదు. అడ్మిషను రిజిష్టరులో ఒక తప్పుడు వివరం నమోదు చేసినందుకు అతడు గాబరా పడిపోయాడు. ఈ విషయం తెలిస్తే పై అధికారులు తనను సంజాయిషీ అడగొచ్చు... 'అయ్యా! పేరంట్స్ చెప్పినట్టుగా రాసుకోడమేనండీ నా విధాయకం' అంటూ తాను తప్పించుకోవచ్చునేమో! అయితే ఈ విచికిత్సకంతా అవతల ఒక ధర్మ సందేహం అతణ్ణి పట్టి పీడిస్తూ వుండిపోయింది. గాంధీజీ, అంబేద్కర్, జాషువాలాంటి పెద్దలు గనుక ఇంకా జీవించి వుంటే ఈ తాజాపరిణామానికి సంతోషించేవారా, విచారించేవారా- అని!

పాఠక మహాశయులారా! దయచేసి మీరీ యక్ష ప్రశ్నకు కాస్త సమాధానం చెప్పగలరా?

❖ వార్త - ఆదివారం 15 ఫిబ్రవరి, 1987. ❖